సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈవో డీపీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే వంశీకి అభినందనలు



ఎమ్మెల్యే వంశీని అభినందిస్తున్న వివిధ సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. వంశీకృష్ణ కార్యాలయంలో ఆదివారం పెద్ద ఎత్తున పార్టీ వర్గాలు, పలు సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ మజ్దూర్ యూనియన్, రెవెన్యూ ఉద్యోగులు, పలు దేవాలయాల కార్యనిర్వహణాధికారులు, పలు వార్డుల కమిటీల నాయకులు ఎమ్మెల్యే వంశీని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బంగారమ్మ ఉత్సవంలో ఎమ్మెల్యే వంశీ



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 28వ వార్డు పరిధి పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

రామోజీరావుకు నివాళి



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ రమణమూర్తి

సీతమ్మధార: రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి అన్నారు. డాల్ఫిన్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఇటు పత్రికా రంగానికి.. అటు సినిమా రంగానికి రామోజీరావు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తమ ఆస్పత్రికి ఆయన వచ్చారని గుర్తు చేసుకున్నారు. హోటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. అంతా శుభ్రం

- పాతనగరాన్ని వదిలిన మురుగు నీటి సమస్య
- రూ. 50 లక్షలతో పంప్ హౌస్‌లో 80 హెచ్‌పీ మోటార్ల ఏర్పాటు
- ప్రజలు, వ్యాపారుల హర్షం

పాతనగరం గతంలో మురుగు నీటి సమస్యతో సతమతమయ్యేది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగిపొర్లడంతో మురుగు బయటికి వచ్చి రహదారులపై ప్రవహించటంతో దుర్వాసనతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు మురుగు నీటిని తోడే పంప్‌హౌస్‌లోని మోటార్ల సామర్థ్యం పెంచటంతో పాతనగర వాసుల మురుగు నీటి కష్టాలకు చెక్ పడింది. దీంతో ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పంప్ హౌస్‌లో ఏర్పాటు చేసిన 80 హెచ్‌పీ మోటార్లు



యూజీడీ మరమ్మతు తర్వాత మురుగు కనిపించని పూర్ణామార్కెట్ రహదారి

జగదాంబ : పాతనగరంలోని మురుగు నీటి సమస్య స్థానికులను తరచూ వేధించేది. కేజీహెచ్ నుంచి జ్ఞానాపురం, పూర్ణామార్కెట్, సీహార్స్ జంక్షన్, రామకృష్ణా వీధి తదితర ప్రాంతాలకు చెందిన మురుగు మొత్తం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా శుద్ధి కేంద్రమైన పంప్ హౌస్‌కు చేరేది. అక్కడ దానిని శుభ్రం చేసేవారు. మిగిలిన వ్యర్థాలన్నీ సముద్రంలో కలిసిపోయేవి. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కావటానికి ప్రధానమైన పంప్ హౌస్‌లోని మురుగు నీటి శుద్ధి మోటార్లు గతంలో ఎప్పుడో ఇక్కడ ఏర్పాటు చేసినవే ఉండేవి. జనాభా పెరగటంతో వాటి సామర్థ్యం సరిపడక మురుగు పూర్తిగా ప్రక్షాళన జరిగేది కాదు. దీంతో పాతనగరంలోని చాలా ప్రాంతాల్లో మురుగు రోడ్ల పైకి వచ్చి దుర్గంధం అలుముకునేది. నివాస ప్రాంతాలు, మార్కెట్లు మురుగుతో నిండిపోయి ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడేవారు.

చాలని మోటార్ల సామర్థ్యం..

గతంలో మురుగును తోడే మోటార్ల సామర్థ్యాన్ని పెంచకపోవడం వల్ల పూర్ణామార్కెట్ ప్రాంతంలో తరచూ మురుగు నీరు బయటికి వచ్చి ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడేవారు. పంప్‌హౌస్ వద్ద గతంలో ఉపయోగించే 15, 20 హెచ్‌పీ మోటార్లు మురుగు నీటిని అనుకున్న రీతిలో తోడలేకపోయేవి. ఈ కారణం వల్ల పాతనగరంలోని పలు ప్రాంతాలు ఎప్పుడు చూసినా మురుగు నీరు, చెమ్మతో ఇబ్బందికరంగా ఉండేవి.

మోటార్ల సామర్థ్యం పెంపు..

నగరాభివృద్ధిలో భాగంగా జీవీఎంసీ యూజీడీ సమస్యకు పూర్తిగా పరిష్కారం చూపించింది. మురుగును వేగంగా తోడేందుకు రూ. 50 లక్షల వ్యయంతో పంప్‌హౌస్‌లో 80 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేసింది. దీంతో యూజీడీల్లో ఉండే మురుగును మోటార్లు సమర్థవంతంగా తోడేస్తుండటంతో రహదారులపై మురుగు ప్రవాహం ఆగిపోయింది. పాత యూజీడీలన్నింటికీ మరమ్మతు చేయడంతో వన్‌టౌన్ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న మురుగు నీటి సమస్య వదిలిపోయింది. దీంతో ప్రజలు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారమైంది..



గతంలో యూజీడీ డ్రెయిన్లు ఉదయం పూట పొంగి మురుగు బయటికి రావడంతో దుర్వాసనకు ఉండలేకపోయేవాళ్లం. ఒక్కోసారి రోడ్డు పైకి వచ్చిన మురుగును చేతులతో ఎత్తి పారబోసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలా చేయకపోతే మా దుకాణాలకు కొనుగోలుదారులు వచ్చేవారు కాదు. జీవీఎంసీ చొరవతో ఇప్పుడు ఆ సమస్య లేదు.

– బాబీ, వ్యాపారి, పూర్ణామార్కెట్

దుర్వాసనతో ఇబ్బంది పడేవాళ్లం..



రోడ్డుపై పారే మురుగు నీటి దుర్వాసనతో ఇబ్బంది పడేవాళ్లం. మా వ్యాపారాలు కూడా సజావుగా సాగేవి కాదు. మురుగు వల్ల మా షాపు వద్ద కొనుగోలు చేసేందుకు ఎవరూ ఇష్టపడేవారు కాదు. వాహనాలు వేగంగా వెళ్తూ ఉండటం వల్ల రోడ్డుపై మురుగు తుళ్లి మా సరుకు కూడా ఒక్కోసారి పాడయ్యేది. జీవీఎంసీ అధికారులు చొరవ తీసుకుని మురుగు నీటి సమస్య పరిష్కరించటంతో ప్రశాంతంగా ఉంది.

– సత్యవతి, పువ్వుల వ్యాపారి, పూర్ణామార్కెట్

క్రీడలు జీవితంలో భాగస్వామ్యం కావాలి



పోటీలను ప్రారంభిస్తున్న విశాల్ గున్నీ

డాబాగార్డెన్స్ : ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావాలని విశాఖపట్నం రేంజ్ పోలీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ విశాల్ గున్నీ అభిప్రాయపడ్డారు. బీఎంసీసీ బిగ్ మ్యాన్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ లీగ్ ప్రారంభ పోటీల్లో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ హోదాల్లో నిరంతరం సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న వారంతా క్రీడలు ఆడటం ఆనందకరమన్నారు. క్రీడల ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండొచ్చన్నారు. క్రీడలకు వయస్సు అడ్డంకి కాదన్నారు. చార్టెడ్ అకౌంటెంట్స్, రోటరీ క్లబ్ ఇతర రంగాలకు చెందిన వ్యక్తులు క్రికెట్ ఆడటం సంతోషకరమన్నారు. బిగ్ మ్యాన్ క్లబ్ అధ్యక్షుడు, సీఏ తేజ, ఎస్ఎస్ఆర్ కార్యదర్శి డాక్టర్ సప్ప నరేష్ మాట్లాడుతూ ఈ పోటీలు వచ్చే నెల 28 వరకు ప్రతి ఆదివారం రైల్వే గ్రౌండ్ వేదికగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సామూహిక ధ్యానం విజయవంతం

పెదగంట్యాడ: వినాయక పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించిన సామూహిక ధ్యానం విజయవంతమైంది. ఈ సందర్భంగా కందుకూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ సభ్యులు పాల్గొన్నారు.

'మెగాస్టార్ ఫ్యాన్' చిత్రం రిలీజ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : 'మెగాస్టార్ ఫ్యాన్' చిత్రం రిలీజ్ పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం సిటీ చిరంజీవి ఫ్యాన్స్ యువత అధ్యక్షుడు వానపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో జరిగింది. అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌పై కిరణ్ వారియర్ దర్శకత్వంలో లుక్స్ రాజ్ హీరోగా, సోనిరెడ్డి హీరోయిన్‌గా అల్లు శ్రీరాములునాయుడు నిర్మాతగా నిర్మించిన ఈ చిత్రం పోస్టర్ రిలీజ్ నగరంలోని క్రాంతి పిక్చర్స్ కార్యాలయంలో నిర్వహించారు. పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న క్రాంతి పిక్చర్స్ అధినేత ఎస్పీ రెడ్డి మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సమాజానికి అందించిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రం నిర్మించామని, ముఖ్యంగా సమాజంలో చీడపురుగులను ఏరివేయాలన్నదే ఈ చిత్ర ముఖ్యోద్దేశమన్నారు. చిత్రంలో తాను ఓ ముఖ్య పాత్రలో నటిస్తున్నట్టు చెప్పారు. దర్శకుడు కిరణ్ తన పాత్రను అమోఘంగా తీర్చిదిద్దాడని చెప్పారు. దర్శకుడు కిరణ్ మాట్లాడుతూ కేవలం చిరంజీవి అభిమానులకే కాక, అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆకట్టుకునే చిత్రంగా ఉంటుందన్నారు. ఈ చిత్రం ముఖ్యంగా యువతను అలరించనుందన్నారు. కార్యక్రమంలో సత్తి రామకృష్ణారెడ్డి, అక్కరమాని వెంకట్రావు, నిర్మాత, దర్శకుడు సత్యారెడ్డి, గల్లా కొండలరావు, శ్రీరామదాసు గోవింద్, కోయిలాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నప్రసాద వితరణ



పేదలకు అన్నప్రసాదం అందజేస్తున్న ఎం.వి.రాజశేఖర్, సత్యనారాయణ, శైలజ

సీతంపేట: అక్కయ్యపాలెంలోని వాగ్దేవి పాఠశాల వద్ద పేదలకు ఆదివారం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా ప్రతి ఆదివారం పేదలకు అన్నప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తున్న ఎం.వి.వి.సత్యనారాయణ, శైలజ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో కుమార్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బండి నీడలో..



షర్బత్ బండి నీడలో ఆశ్రయం పొందుతున్న వృద్ధురాలు

చిత్రంలో కనిపిస్తున్న ఈ బండి ఒకరికి ఉపాధినిస్తోంది.. మరొకరికి సేదదీరుస్తోంది. ఈ దృశ్యం ఫిషింగ్ హార్బర్ పర్యాటకులు.. సందర్శకులు.. కొనుగోలుదారులను ఇట్టే ఆకట్టుకుంది. అసలే ఆదివారం. ఆపై భానుడి ప్రతాపం అంతా ఇంతా కాదు. నడిరోడ్డుపై అడుగు వెయ్యాలంటే సాహసం చెయ్యాల్సిందే. ఆదివారం కావడంతో ఫిషింగ్ హార్బర్‌కు చేపలు/రొయ్యలు కొనుగోలు చేసేందుకు ప్రజలు.. ఫిషింగ్ హార్బర్‌ను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎండ వేడిమి తట్టుకోలేక ఎంతో మంది గుక్కెడు మంచినీటి కోసం తహతహలాడారు. ఎండు చేపలు విక్రయిస్తున్న ప్రాంతంలో ఓ షర్బత్ బండి కనిపించింది. దీంతో చాలా మంది పర్యాటకులు.. చేపల కొనుగోలుదారులు అక్కడికి చేరి దాహార్తి తీర్చుకున్నారు. ఈ విధంగా షర్బత్ విక్రయించే చిరువ్యాపారికి ఆ బండి ఉపాధి కల్పిస్తే.. ఆ బండి కింద 80 ఏళ్ల వృద్ధురాలు (ఎండు చేపలు విక్రయించే బామ్మ) నీడను ఆశ్రయిస్తూ కూర్చోవటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

–డాబాగార్డెన్స్

బ్రహ్మకుమారీల నూతన ధ్యానమందిరం ప్రారంభం



బ్రహ్మకుమారీస్ అగనంపూడి నూతన ధ్యాన మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు



కార్యక్రమంలో పాల్గొన్న ధ్యానులు, బ్రహ్మకుమారీలు

అగనంపూడి: బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం అగనంపూడిలోని దివ్య జ్యోతి భవనం సారథ్యంలో నిర్మితమైన ధ్యాన మందిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న భవనం ఆవరణంలోనే మూడో అంతస్తులో ధ్యాన మందిరం కోసం నిర్మించిన ఫ్లోర్‌ను ప్రారంభించారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకె వేణి అక్కయ్య, కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య అగనంపూడి ఇన్‌చార్జ్ బీకే రామకోటి పర్యవేక్షణలో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని రాజస్థాన్‌లోని మౌంట్ అబూ నుంచి విచ్చేసిన బీకే వేడి భాయీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడి బ్రాంచ్ ద్వారా లోక కల్యాణం, విశ్వ శాంతి కోసం దివ్యజ్యోతి భవనం నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి శిక్షణ పొందే 150 మంది బ్రహ్మకుమారీలు ఉండేందుకు వీలుగా సౌకర్యం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విశాఖ జిల్లా ఇన్‌చార్జ్ బీకే వేణి అక్కయ్య మాట్లాడుతూ మనిషి ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడానికి, ధ్యానంతో మానసిక ప్రశాంతతను కల్పించేందుకు వీలుగా ఇక్కడ ధ్యానులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యోగా బట్టీలు నిర్వహించడం ద్వారా పరిసర ప్రాంతంలో పాజిటివ్ ఆలోచనలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజయోగి బీకే సోమేశ్వరి అక్కయ్య, ఇన్‌చార్జ్ రామకోటి, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ, సక్కా రమణబాబు, విద్యావేత్తలు టి.బలరామకృష్ణ, బొండా అప్పారావు మాస్టార్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ఎల్.వి.రమణ, వివిధ బ్రాంచ్‌ల ఇన్‌చార్జ్‌లు, ధ్యానులు పాల్గొన్నారు.

అయ్యో నాగేంద్ర..

- యంత్రాల శబ్దాలకు బయటికి వచ్చిన నాగుపాము
- తిరిగి సురక్షిత ప్రదేశానికి చేరుకోలేక ఉష్ణ తాపానికి మృత్యువాత



యంత్ర పరికరాలతో కొండను తవ్వుతున్న కార్మికులు



కొండ నుంచి నడిరోడ్డు పైకి దొర్లిన నాగుపాము



ఎండ వేడిమికి ఇబ్బందులు పడుతున్న పాము



తుప్పల్లోకి వెళ్లలేక భానుడి ప్రతాపానికి బలైన నాగుపాము

డాబాగార్డెన్స్ : నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. భానుడి ప్రతాపానికి తట్టుకోలేక వృద్ధులు పిట్టల్లా రాలిపోతున్నారు. ఇదిలా ఉండగా.. పోర్టు పరిసర ప్రాంతాల్లో ఎండ వేడిమి తట్టుకోలేక.. పొదలు కానరాక తరచూ విష సర్పాలు బయటికి వచ్చేస్తున్నాయి. పాత పోస్టాఫీస్ సమీపాన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పోర్టు చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా రహదారికి అడ్డంకిగా మారిన కొండను యంత్ర పరికరాలతో తవ్వుతున్నారు. దీంతో కొండల్లో దాగి ఉన్న విష సర్పాలు ఆ శబ్దాలకు భయపడి పోర్టు పరిసర ప్రాంతాల రోడ్ల పైకి వచ్చేస్తున్నాయి. ఆదివారం ఉదయం 12 గంటల ప్రాంతంలో ఓ నాగుపాము పిల్ల కొండ నుంచి దొర్లిపడి నడిరోడ్డుపైకి వచ్చేసింది. అప్పటికే 37 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు ఉండడంతో ఎటూ వెళ్లలేక ఎండ వేడిమిని తట్టుకోలేక గిలగిలా కొట్టుకుంటూ మృత్యువాత పడింది.

14 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం శ్రీ వారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు 4 రోజుల పాటు వేదపండితులతో విశేష పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించనున్నారు.

కార్యక్రమాల వివరాలు:

14వ తేదీన: ఆరోజు సాయంత్రం తిరుమలేశుని సన్నిధిలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అజస్ర దీపారాధన, మేధినీ పూజ, అంకురార్పణం, వాస్తు పూజ, వాస్తు హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహిస్తారు.

15వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 5.30 గంటలకు తోమాల సేవ, 6.30 గంటలకు అర్చన, 7 గంటలకు భక్తులకు సర్వదర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆచార్యవరణం, రిత్విక్ వరణం, అకల్మష హోమం, గరుడ ప్రతిష్ఠ, ఆదివాసత్రయం, ఆదివాసత్రయ హోమం, లఘు పూర్ణాహుతి, నీరాజనం, మంత్రపుష్పం. సంతానం లేని మహిళలకు శ్రీ వారి గరుడ ప్రసాదం సాయంత్ర 7 గంటలకు అందజేయనున్నట్టు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

16వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు అర్చన, 7 గంటలకు భక్తులకు శ్రీవారి దర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, ధాతాది మూల హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం, బలిహరణ, నీరాజనం, మంత్ర పుష్పం, 9.30 గంటలకు శ్రీ వారి పెద్ద శేష వాహన సేవ, తీర్థ ప్రసాద వితరణ జరపబడును.

సాయంత్రం: 6.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, పారమాత్మిక మహాశాంతి హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం, రాత్రి 8.00 గంటలకు శ్రీ వారి గరుడ వాహన సేవ (గరుడోత్సవం) నిర్వహిస్తారు.

17వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు అర్చన, 7 గంటలకు శ్రీ వారి సర్వదర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, సర్వ దైవత్య హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 9.30 గంటలకు సూర్య ప్రభ వాహన సేవ, 11 గంటలకు శ్రీ వారి ఉత్సవ బింబాలకు అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 5.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామి మూల మంత్ర హోమం, బలిహరణ, 6 గంటలకు స్వామికి ముత్యాల పందిరి వాహన సేవ, 7 గంటలకు శ్రీ వారి ప్రథమ వార్షిక కళ్యాణోత్సవం, నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ జరుపబడును.

18వ తేదీన: ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు అర్చన, శ్రీ వారి దర్శనం, 7.30 గంటలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం, మహా పుణ్యాహుతి, బలిహరణ, 10 గంటలకు వసంతోత్సవం, శ్రీ వారి స్నపన తిరుమంజనం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా చిన్మయ మిషన్ మాతృ, పితృ పూజ



మాతృ, పితృ పూజలో పాల్గొన్న బాలబాలికలు

ఉక్కునగరం: చిన్మయ మిషన్, ఉక్కునగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాతృ, పితృ పూజ ఘనంగా నిర్వహించారు. చిన్మయ మిషన్ 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వామి రఘువీరానంద ఆధ్వర్యంలో 'బాలల కూల్ క్యాంప్ ' నిర్వహించారు. క్యాంప్ ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. పిల్లలకు తల్లిదండ్రులపై గౌరరభావాలు పెంపొందించే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంపై తల్లిదండ్రులు చిన్మయ మిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్యాంప్‌లో పాల్గొన్న బాలబాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ కార్యదర్శి జయంతి కుమార్‌తో పాటు పలువురు స్టీల్ ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.